


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

113

(3' ఫిబ్రవరి 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**ముద్దులు** ఎంత ప్రేమ భూయిష్టాలో అంత ప్రమాదకరాలు కూడా. అక్రమమైన చుంబనాలు అతి విషాదకరమై పరిస్థితులకు దారి తీస్తాయని మిల్సు అనే ఆయన ఒక వ్యాసం వ్రాశాడిటీవల. ఆయన వ్రాసిన ఒక సంఘటన వినండి:

పశ్చిమ జర్మనీలో ఆలెన్ అనే పట్టణంలో పదమూడు సంవత్సరాల ఒక బడి కుర్రవాడు అదే వయస్సుగల క్లాస్‌మేట్. లుఫిఎన్ అనే అమ్మాయిని హఠాత్తుగా ముద్దుపెట్టుకున్నాడట. ఆ షాక్‌తో హృదయం ఆగిపోయి అమ్మాయి వెంటనే మరణించింది.

ముద్దు అలా తీసుకోవడం తప్పుడు చర్యగా భావిస్తూ ఉంటారు. జీవితంలో సిగ్గుపడవలసిన విషయంగా తలపోస్తారు. కానీ, కొన్ని కొన్ని సందర్భాలలో అది ప్రాణం కూడా తీస్తుందనే విషయం తెలియచేస్తున్నదీ పై సంఘటన.

బయటివాళ్ళ విషయంలోనేకాదు. దంపతుల విషయంలో కూడా ఒకప్పుడు హఠాత్తుగా పెట్టే ముద్దువల్ల చాలా వ్యయప్రయాసలేర్పడుతాయని మిల్సు మరో ఉదంతం తెలియజేసాడు.

హెన్రీ మూర్ అనే ఆయన సతీ సమేతంగా విమానంలో ప్రయాణం చేస్తున్నాడట అమెరికాలో. భార్యకు ఏం చాదస్తం పుట్టిందో అంత ముసలి భర్తనూ అమాంతంగా ముద్దుపెట్టుకున్నదట. ఆ సమయంలో ఆయ్యన కాక్‌టైల్ ఫలహారం చేస్తున్నాడు. ఒక ముక్క బుగ్గన ఉంది. భార్య హఠాత్తు చర్యవల్ల అది గొంతులోకి పోయి ఎంతో బాధ పెట్టింది.

ఆకాశ మధ్యంలో ఆ పురుష పుంగవుడు గొంతులో బొమిక గ్రుచ్చుకుని గోలపెట్టడం చూసి వైమానికుడు జాలిపడి ఒక చోట విమానాన్ని బలవంతంగా దింపి, హెన్రీ మూర్‌కు చికిత్స చేయించవలసి వచ్చింది. చికిత్స ఖర్చు ఎంత అయిందో తెలియదుగాని వైమానికునికి అలా విమానం దించడం వల్ల పదిహేనువందల గాలన్ల పెట్రోలు నష్టమైంది. ఈ ఘనకార్యానికి కారకులైన అతివ మిడిగ్రుడ్లు వేసుకుని అలా నిలబడి ఉందట. పాపం హెన్రీ ఎలాగో బ్రతికి బయట పడ్డాడుట. తర్వాత చెప్పివుంటాడు బహుశః ముందుగా నోటీసు యివ్వకుండా అలాంటి పిచ్చిపనులు చెయ్యవద్దని.

ముద్దులు యుద్ధాలకు కూడా దారి తీసిన సంఘటనలు చాలా ఉన్నాయి. మధ్య ప్రాచ్యానికి చెందిన కథలు "ముద్దుల యుద్ధం" అని ఒక కథవుంది. ఒక ప్రాంతంలో ప్రత్యేకించి స్త్రీలు నివాసమేర్పరచుకుని పురుషులతో సంబంధం లేకుండా కాలం గడుపుతూ ఉంటారు.

ఒకసారి ఒక పురుషుడు ఎలాగో వచ్చి ఆ రాజ్యంలో అడుగుపెడతాడు. అది చూసిన ఆడ పోలీసు అతణ్ణి వెంటనే వెళ్ళిపోవలసిందనీ, లేకపోతే ప్రాణాలు దక్కవని చెబుతుంది. అతగాడు ఒక్క ముద్దు బహుమతి యిస్తే వెళ్ళిపోతానంటాడు. అది గొప్ప నేరం ఆ దేశంలోని రాజ్యాంగం ప్రకారం అతణ్ణి వెంటనే పట్టుకోబోతుంది. కాని, అతడు సరిహద్దు దాటి పారిపోతాడు. ఆ తరువాత అటున్న పురుషులకూ, ఇటున్న స్త్రీలకూ యుద్ధం జరుగుతుంది. పురుషులు స్త్రీలమీద జాలితలచి పెద్ద పెద్ద ఆయుధాలు

ఉపయోగించకుండా పళ్ళూ, పూలచెండ్లు విసరడం ప్రారంభిస్తారు. ఆడవాళ్ళు తమవద్ద బాణాలు వగైరా లేకపోవడంవల్ల కోడిగ్రుడ్లు, వెన్నముద్దలు, పిండిముద్దలు విసురుతారు.

ఈ యుద్ధం పదహారు రోజులు జరిగిందనీ, తర్వాత రాజీ జరిగిందనీ, దానిలో స్త్రీలు కోరందే పురుషులు ముద్దు పెడతామని ముందుకు రాకూడదనీ షరతు పెట్టారు. అక్కడితో ముగిసింది.

మూడు శతాబ్దాల క్రితం బవేరియా దేశాన్ని ఫర్డినండ్ అనే రాజు పాలిస్తూ ఉండేవాడు. అతగాడు పొరుగుదేశానికి ఆహ్వానింపబడ్డాడు. అతి గొప్పగా స్వాగతమిచ్చారా దేశప్రజలూ, ప్రభువూ.

అయితేనేం బవేరియా రాజు ఒక పిచ్చిపని చేశాడు. అక్కడ ఒక తోటలో పువ్వులు కోస్తున్న అమ్మాయిని చూశాడు. దాసీపిల్ల అనుకున్నాడు. ఆమె అందం చూసి ఫర్డినాండ్ వివశుడై వెంటనే ముద్దుపెట్టుకున్నాడు. ఆమె ప్రియుడు చూశాడు ఆ దుస్సంఘటన.

ఫర్డినాండ్ అనుకున్నట్లు ఆమె దాసీకాదు. ఆ దేశపు రాకుమార్తె. ఇంకేముంది? కొంపమునిగింది. అతడు బవేరియా రాజు భరతం పట్టించడానికి వచ్చాడు. అతడు "పొరపాటున అలా జరిగిందని" ఎంతో మొత్తుకున్నాడు. కానీ, ఇలాంటి సందర్భాల్లో పొరపాట్లకు తావు ఎక్కడ ఉంటుంది?

రాజుకోసం కట్టిన స్వాగత తోరణాలు చించివేశారు. సన్మాన పత్రాలు చించివేశారు. బవేరియా రాజు ఎలాగో బ్రతికి బయటపడి తన దేశానికి పారిపోయాడు. ఉభయ రాజ్యాల మధ్యగల రాజకీయ సంబంధాలు తెంచివేయబడ్డాయి. అక్కడితో ఆగలేదు. రెండు రాజ్యాల మధ్య పెద్ద యుద్ధం ప్రారంభమైంది. ఎంతమందో ప్రాణాలు అర్పించాల్సి వచ్చింది. రాజు చేసిన చిలిపిచేష్టకింత రగడ జరిగింది.

నా చిన్నతనంలో మా ఊర్లో కాపు సుబ్బయ్యగారని ఒకాయన ఉండేవాడు. ఆయన వీధి నాటకాలు వేయిస్తూ ఉండేవాడు. కొన్ని తనే వ్రాసేవాడు. కొన్నిటిని ఇతరులచేత చెప్పి వ్రాయించేవాడు. అలాటివాటిలో కృష్ణలీలలు ఒకటి.

ఆ నాటకం మా ఊళ్ళో చాలాసార్లు వేయించాడు. ప్రజలు పొట్టచెక్కలయ్యేటట్లు నవ్వుకునేవారు. కృష్ణుడికి అతనికంటే పెద్దవాడు, కుంటివాడు అయిన ఒక మిత్రుడుండేవాడు. పైగా అతడు అతి స్థూలకాయుడు. కృష్ణుడు అక్కడక్కడ దొంగతనంగా తినివచ్చి ఆ సంతోషంతో ఆ స్థూలకాయుని చెంపను ముద్దు పెట్టేవాడు. పాప మా మిత్రుడు ఆ పెట్టే ముద్దు తన పెదవులమీద పెట్టమనేవాడు. కొంచెం కమ్మదనం ఉంటుందని. కృష్ణుడు 'ఛీ' అని పారిపోయేవాడు.

మళ్ళీ కృష్ణయ్యకే సలహా కావలసి వచ్చినా ఆ బొండాం మిత్రుని వద్దకే పరుగెత్తుకు వచ్చేవాడు. అతడు ఆరితేరిన వాడులాగా సలహాలు చెప్పేవాడు. కృష్ణుడు అతగాడి తెలివితేటలకి ఎంతో మెచ్చుకునేవాడు. ఒక సీనులో ఆ మిత్రుడు మొక్కజొన్నపొత్తు నములుతూ కూర్చునివుంటాడు. కృష్ణుడు పరుగుపరుగున వచ్చి అతడి దగ్గర కూలబడతాడు. భయంతో వణుకుతున్నట్లు నటిస్తాడు. మిత్రుడు 'ఏమిటి కృష్ణా? ఏమిటి? నువ్వు వణుకుతుంటే నాకూ వణుకు పుడుతోంది' అని పొట్టంతా కదిలేలాగా వణకడం ప్రారంభిస్తాడు.

కృష్ణుడు "నువ్వు వణుకుతావు దేనికిరా తప్పు చేసింది నేనైతే" అంటాడు. చివరకు తను చేసినపని తప్పో, ఒప్పో చెప్పమని మిత్రుణ్ణి అడుగుతాడు. కృష్ణుని వాగ్మూలం ఇదే

"రాధ అత్త పెరట్లో కూర్చుని పూలదండ కడుతోంది. నేను చాటుగా వెళ్ళాను. అల్లరి చెయ్యాలనిపించింది. చెప్పకుండా చెంపను ముద్దాడాను. ఆవిడ వెనక్కు తిరిగి చూసి వోరీ అంది. అక్కడితో పారిపోయి చక్కా వచ్చాను."

మిత్రుడది విని "మరి వోరీ అన్నప్పుడు నవ్వుతూ అందా, గుడ్లల్లో కుంకుడుకాయ రసం పోసినట్లు కోపం తెచ్చుకుని అందా?" అని ప్రశ్నించాడు.

"గుడ్లూ, ముఖం తెల్లగానే ఉన్నాయి. పెదవులమీద చిరునవ్వు కూడా ఉంది" అని కృష్ణుని జవాబు.